రోడ్డు విస్తరణను 100 ఫీట్లకే పరిమితం చేయాలి



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న రెవెన్యూ అధికారులు

అల్వాల్‌ గ్రామసభకు హాజరైన డిప్యూటీ కలెక్టర్‌

అల్వాల్‌: రాజీవ్‌ రహదారిపై నిర్మించ తలపెట్టిన ఎలివేటెడ్‌ కారిడార్‌ కోసం రోడ్డు విస్తరణను 100 ఫీట్లకే పరిమితం చేయాలని రోడ్డు విస్తరణ స్థల బాధితులు అధికారులను కోరారు. మంగళవారం అల్వాల్‌లో జరిగిన గ్రామసభకు హాజరైన పలువురు బాధితులు తమ గోడును వెల్లబుచ్చారు. 200 ఫీట్ల విస్తరణ చేపడితే కేవలం అల్వాల్‌, లోతుకుంటలోనే 132కు పైగా బాధితులు స్థలాన్ని కోల్పోతున్నారన్నారు. జీహెచ్‌ఎంసీలో ఎక్కడా లేని విధంగా 200 ఫీట్ల రోడ్డు ఏర్పాటు చేయాలనుకోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ప్రకటించే నష్టపరిహారం అందరికీ ఆమోదయోగ్యంగా ఉండాలన్నారు.

● మేడ్చల్‌, మల్కాజిగిరి డిప్యూటీ కలెక్టర్‌ శంకర్‌కుమార్‌, అల్వాల్‌ మండల తహసీల్దార్‌ రాములుతో పాటు రెవెన్యూ సిబ్బంది గ్రామసభ వివరాలను బాధితులకు తెలియజేశారు. బాధితుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఎలవేటెడ్‌ కారిడార్‌ స్థల బాధితులందరూ కలిసి జేఏసీ ఏర్పాటు చేసుకుందామని కన్వీనర్‌ సతీష్‌గుప్తా అధికారులకు చెప్పారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించుకునేందుకు జేఏసీ పోరాడుతుందన్నారు. కార్పొరేటర్‌ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

రూ.40 లక్షలతో లేక్‌పార్క్‌ సుందరీకరణ

మల్కాజిగిరి: సఫిల్‌గూడ లేక్‌పార్క్‌ సుందరీకరణ పనులను స్థానిక కార్పొరేటర్‌ శ్రవణ్‌ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. సుమారు రూ.40 లక్షలతో ఎంట్రన్స్‌ ఆర్చ్‌తో పాటు పార్కు లోపల సుందరీకరణ పనులు జరుగుతాయన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్‌ విభాగం ఈఈ లక్ష్మణ్‌కు సూచించామన్నారు. పనులు పరిశీలించాల్సిన డీఈ మహేష్‌ హాజరుకాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల మధ్య సమన్వయం లేదన్నారు. గతంలో మేయర్‌తో పాటు అప్పటి కమిషనర్‌ ఆమ్రపాలి నోడల్‌ ఆఫీసర్‌గా మహేష్‌కు అప్పగించారని, వారు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఏఈ నవీన్‌, వీఐ రమేష్‌ పాల్గొన్నారు.



పనులపై ఆరా తీస్తున్న కార్పొరేటర్‌ శ్రవణ్‌

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే విజయోత్సవాలు అని మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్‌ వార్డు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్‌ శ్రీనివాసరావు, కార్పొరేటర్లు రజితాపరమేశ్వర్‌రెడ్డి, స్వర్ణరాజ్‌, బొంతు శ్రీదేవిలతో కలసి మాట్లాడారు. అధికారంలోకి రాగానే ఉచితబస్సు ప్రయాణం ప్రారంభించామన్నారు. దేశంలోని ఏ ప్రభుత్వం చేయని విధంగా ఏకంగా రూ.21 వేల కోట్లతో రుణమాఫీ చేశామని వివరించారు. ప్రతి కార్యకర్త నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో పర్యటించి కరపత్రాల ద్వారా కాంగ్రెస్‌ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలని సూచించారు. ఉప్పల్‌ నియోజకవర్గ అభివృద్ధికి రూ. 200 కోట్ల నిధులిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్‌ నేతలు కంది ఆగిరెడ్డి, ధన్‌పాల్‌రెడ్డి, తౌఫిక్‌, సుధాకర్‌రెడ్డి, చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, గణేష్‌నాయక్‌, తెల్కల మోహన్‌రెడ్డి, తవిడబోయిన గిరిబాబు, సీతారాంరెడ్డి, లింగంపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

బోడుప్పల్‌: నగర అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు బోడుప్పల్‌ మేయర్‌ తోటకూర అజయ్‌ యాదవ్‌ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం, ఎస్‌హెచ్‌జీ మహిళాస్టాల్స్‌, ఉచిత వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం స్కూల్‌ విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. నగర పాలక సంస్థ పరిధిలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ.. స్వచ్ఛ బోడుప్పల్‌ దిశగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు. కమిషనర్‌ రామలింగం, డిప్యూటీ మేయర్‌ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్‌, కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు చీరాల నర్సింహ్మా, రాసాల వెంకటేష్‌యాదవ్‌, సుమన్‌నాయక్‌, కొత్త దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.



విజయోత్సవ ర్యాలీలో మేయర్‌ అజయ్‌యాదవ్‌ విద్యార్థినులు

ఉచిత వైద్య శిబిరం



పారిశుద్ధ్య కార్మికులకు కంటి పరీక్షలు ప్రారంభిస్తున్న దృశ్యం



కుషాయిగూడ మార్కెట్‌లో కంటి, దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

మల్కాజిగిరి: ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌ డివిజన్‌ జవహర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా.. కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌, డీసీ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజాపాలన ఏడాది విజయవంతమైందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించడానికి ప్రభుత్వం ముందుంటుందని చెప్పారు. ఏఎమ్‌హెచ్‌ఓ డాక్టర్‌ మంజుల, ఎస్‌ఎస్‌ శ్రీనివాస్‌ తదితరులున్నారు. మాక్సివిజన్‌ ఆసుపత్రి సౌజన్యంతో కంటి పరీక్షలు, ఇతర ఆసుపత్రుల సహకారంతో దంతపరీక్షలు, సాధారణ పరీక్షలు నిర్వహించామని డీసీ తెలిపారు.

లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో..

కుషాయిగూడ: సేవా భావనతో ఏర్పడిన లయన్స్‌ క్లబ్‌ల సేవలు మరింత విస్తృతం చేయాలని లయన్స్‌ క్లబ్‌ డిస్ట్రిక్ట్‌ గవర్నర్‌ లయన్‌ కృష్ణప్రసాద్‌ అన్నారు. మంగళవారం కుషాయిగూడ కూరగాయాల మార్కెట్‌లో కాప్రా, ఏఎస్‌రావునగర్‌ లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్లానెట్‌ ఆప్టికల్స్‌ ఆధ్వర్యంలో కంటిపరీక్షలు, పద్మసాయి డెంటల్‌ క్లినిక్‌ ఆధ్వర్యంలో వ్యాపారులకు దంత పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు, సలహాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఆరునెలలకోసారి విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. లయన్స్‌క్లబ్‌ వైస్‌ డిస్ట్రిక్ట్‌ గవర్నర్‌ ఇన్నారెడ్డి, క్లోం కృష్ణారెడ్డి, సురేష్‌కుమార్‌ మందా, క్లబ్‌ అధ్యక్షురాలు మాకవరం శ్రీదేవి, వరప్రసాద్‌, విజయ్‌కుమార్‌, మార్కెట్‌ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకటేష్‌ గుప్తా, నరసింహరెడ్డి, రాములు, రవి, మహేష్‌, సూర్యకుమార్‌, సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ కాప్రా సర్కిల్‌ కార్యాలయంలో..

కాప్రా: జీహెచ్‌ఎంసీ కాప్రా సర్కిల్‌ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం ద్వారా దాదాపు 300 మంది శానిటేషన్‌ సిబ్బందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్‌ జగన్‌, శానిటేషన్‌ డీఈ ప్రశాంత్‌, సూపర్‌వైజర్‌ సుదర్శన్‌, డాక్టర్‌ విజయరాణి, డాక్టర్‌ ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌: వెంకటాపురంలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్‌ శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఏఎంహెచ్‌వో రజిని, డాక్టర్‌ కావ్య, రజిని, భానుప్రియ, శానిటేషన్‌ సూపర్‌వైజర్‌ ప్రభాకర్‌, వెంకటేష్‌, విష్ణు పాల్గొన్నారు.





కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



హెచ్‌బీకాలనీలో ట్రై సైకిళ్లను అందజేసిన ఎమ్మెల్యే బండారి

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

ఉప్పల్‌, మల్కాజిగిరి జోన్‌ పరిధిలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం దివ్యాంగ విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రజా ప్రతినిధులు దివ్యాంగుల్లో మనోధైర్యాన్ని నింపారు. వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చి జీవితంపై భరోసా కల్పించారు. పలువురికి ట్రై సైకిళ్లు, వీల్‌ చైర్లు, ట్రైపాడ్లతో పాటుగా దాదాపు 200 మందికి దుప్పట్లు, మూడు గ్రూపులకు రూ.12 లక్షల గ్రాంట్‌ను అందజేశారు.

– ఉప్పల్‌, మల్కాజిగిరి జోన్‌ బృందం



చిన్నారులతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



వీల్‌చైర్స్‌ అందజేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



దుప్పట్లు అందజేస్తున్న కార్పొరేటర్లు శ్రీదేవి, స్వర్ణరాజ్‌



ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌



ఉప్పల్‌ సర్కిల్‌ కార్యాలయంలో వీల్‌చైర్లు అందజేస్తున్న దృశ్యం



అనురాగ్‌ స్కూల్‌లో..



నాచారం సాధన దివ్యాంగుల పాఠశాలలో..

జాతీయస్థాయి బాక్సింగ్‌ పోటీలకు ఎంపిక



మల్లాపూర్‌: నాచారంకు చెందిన జూపల్లి అనుగ్రహ ఢిల్లీలో ఈనెల 9న జరగబోయే అండర్‌– 17 జాతీయ బాక్సింగ్‌ పోటీలకు ఎంపికైనట్లు బాక్సింగ్‌ అకాడమీ కోచ్‌ ఎం.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం వరంగల్‌లో జరిగిన 68వ స్కూల్‌ గేమ్స్‌ రాష్ట్రస్థాయి బాక్సింగ్‌ పోటీలలో జూపల్లి అనుగ్రహ గోల్డ్‌మెడల్‌ సాధించి, ఢిల్లీలో జరిగే బాక్సింగ్‌ పోటీలకు ఎంపికైంది.

పోస్టర్‌ ఆవిష్కరణ



మల్లాపూర్‌: ఈనెల 7,8 న నిజాంపేట్‌ ప్రగతినగర్‌లో జరగనున్న సీపీఎం పార్టీ మహాసభల పోస్టర్‌ను నాచారంలో మంగళవారం మేడ్చల్‌ సీఐటీయూ కార్యదర్శి గణేష్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్మిక హక్కులకు అనేక పోరాటాలు చేసిన చరిత్ర పార్టీకి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తోందన్నారు. వెంకన్న, భాస్కర్‌, నాగమణి, జానకమ్మ, సరోజ, నాగయ్య, దేవేందర్‌, యాకయ్య, సుభాషిని, కవిత తదితరులున్నారు.

అనుమతి లేని క్లినిక్‌ సీజ్‌

ఉప్పల్‌: అనుమతి లేని క్లినిక్‌ను డ్రగ్‌ అండ్‌ కంట్రోల్‌ అధికారులు మంగళవారం సాయంత్రం సీజ్‌ చేశారు. ఉప్పల్‌ బీరప్పగడ్డ శ్రీనగర్‌ కాలనీ రోడ్డు నంబర్‌ 1లో అంజలి క్లినిక్‌ పేరిట నిర్వహిస్తున్న క్లినిక్‌పై దాడి చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా స్టెరాయిడ్స్‌, యాంటి బయోటిక్స్‌ లాంటి దాదాపుగా 17 రకాల మెడిసన్‌ను దాదాపు రూ. 21 వేల విలువైన మందుల సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అర్హత లేని వారు క్లినిక్‌ నడపడమే కాకుండా ప్రజల ప్రాణాలు, ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే మెడిసన్‌ను విక్రయిస్తున్నారని అధికారులు వివరించారు.

ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ



ర్యాలీలో మేయర్‌ అమర్‌సింగ్‌, డిప్యూటీ మేయర్‌ కుర్ర శివకుమార్‌గౌడ్‌

మేడిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో మేయర్‌ అమర్‌సింగ్‌, డిప్యూటీ మేయర్‌ కుర్ర శివకుమార్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం రాంచందర్‌సింగ్‌ కాలనీ ట్రైబల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ స్కూల్‌ నుంచి వరంగల్‌ హైవే డెకత్లాన్‌ వరకు విజయోత్సవర్యాలీని నిర్వహించారు. అనంతరం డెకత్లాన్‌ వద్ద పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లను పంపిణీ చేసి, మేడిపల్లి అర్బన్‌ ప్రైమరీ హెల్త్‌ సెంటర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. విజయోత్సవాల్లో భాగంగా 12వ వార్డులో సాయిబాబా గుడి కమ్యూనిటీహాల్‌లో నగర పౌరులకు కంటి పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి అద్దాలు, మందులను పంపిణీ చేశారు. 17వ వార్డులో జరుగుతున్న శానిటేషన్‌ స్పెషల్‌ డ్రైవ్‌ క్లీనింగ్‌ పనులను పరిశీలించి అనంతరం స్వయం సహాయక బృందాలకు డెకత్లాన్‌ వద్ద మేయర్‌, అధికారులు మెప్మా ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ అనిల్‌కుమార్‌తో కలిసి బ్యాంక్‌ లింకేజీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్‌ అమర్‌సింగ్‌ మాట్లాడుతూ... పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ, వారికి మెరుగైన ఆరోగ్య సేవలను అందించడం, కార్పొరేషన్‌ బాధ్యత అన్నారు. మున్సిపల్‌ కమిషనర్‌ రఘు, డీఈ సాయినాథ్‌గౌడ్‌, రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు, పారిశుద్ధ్య కార్మికులు, ఆరోగ్యశాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏం సాధించారని సంబరాలు ?

కుషాయిగూడ: 'రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోందని, ఏదో సాధించామని, ఆ పార్టీ నేతలు చెబుతున్నారని' బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్‌. ప్రభాకర్‌ అన్నారు. '6 గ్యారంటీలు, 66 మోసాలు' అనే నినాదంతో ప్లకార్డు ప్రదర్శిస్తూ బీజేపీ శ్రేణులు నిరసన చేపడుతున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా మంగళవారం ఈసీఐఎల్‌ చౌరస్తా నుంచి కుషాయిగూడ వరకు బీజేపీ నేతలు పెద్దఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బీజేపీ మహిళా అధ్యక్షురాలు శిల్పారెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. రుణమాఫీ మొక్కుబడిగా సాగిందని, ఇప్పటికీ బ్యాంకులు రైతుల పాస్‌బుక్‌లను వారికి ఇవ్వలేదన్నారు. బీజేపీ నేతలు మర్రి మోహన్‌రెడ్డి, నాదం, సురేందర్‌గౌడ్‌, నర్సింగరావు, లక్ష్మణ్‌గౌడ్‌, ఆనంద్‌గౌడ్‌, చల్లా ప్రభాకర్‌, అశోక్‌, హరినాయక్‌, మహేష్‌, భాస్కర్‌రెడ్డి, కృష్ణవేణి పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల రిమాండ్‌



మేడిపల్లి: నిషేధిత గంజాయిని అక్రమంగా తీసుకెళ్తున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్‌ సూర్యహిల్స్‌ ఏరియాలో మేడిపల్లి పోలీసులు పెట్రోలింగ్‌ నిర్వహిస్తుండగా.. బోడుప్పల్‌కు చెందిన సిద్దం వంశీ (23)డ్రైవర్‌, ఆనంద్‌ (27) డెకరేషన్‌ వర్క్‌, సునీల్‌ (21) విద్యార్థి, చుక్క సాయి (24)ప్రైవేట్‌ ఉద్యోగి కాగా.. వీరు అనుమానాస్పదంగా నడుచుకుంటూ.. వెళ్తుండగా.. వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. సుమారుగా 100 గ్రాముల గంజాయి వారివద్ద దొరికింది. దీంతో కేసు నమోదు చేసి మంగళవారం నిందితులను రిమాండ్‌కు తరలించారు.

నాలా పూడికతీత పనుల పరిశీలన



పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ జితేంద్రనాథ్‌, డీసీ శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్‌: మచ్చబొల్లారం డివిజన్‌ అభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్‌ రాజ్‌ జితేంద్రనాథ్‌ అన్నారు. మంగళవారం డివిజన్‌ పరిధిలోని బొబ్బిలి లింగారెడ్డి కాలనీలోని పోచమ్మ గుడి వద్ద జరుగుతున్న నాలాలో డీసెల్టింగ్‌ పనులను ఆయన పర్యవేక్షించారు. అల్వాల్‌ సర్కిల్‌ డీసీ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ. మహేష్‌, ఏఈ. రవళి, అఫ్రోజ్‌, నేతలు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్‌, వెంకట్‌ తదితరులున్నారు.

కాలుష్య నియంత్రణపై అవగాహన ర్యాలీ

అల్వాల్‌: వినాయక్‌నగర్‌ అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌లో జాతీయ గాలి కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్‌, మల్కాజిగిరి డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ రఘునాథస్వామి హాజరై కాలుష్య నియంత్రణపై అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో కాలుష్యాన్ని తగ్గించడంలో అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. భవిష్యత్‌తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రజలు స్థిరమైన జీవనశైలిని అవలంబించాలని ఆయన తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్‌ శోభారాణి, డాక్టర్‌ సత్యవతి, జిల్లా ప్రోగ్రామ్‌ ఆఫీసర్లు డాక్టర్‌ మల్లేశ్వరి, డాక్టర్‌ శ్రీదేవి, డాక్టర్‌ గీతాప్రసాద్‌, డాక్టర్‌ సరస్వతి, డాక్టర్‌ పద్మావతి, అసిస్టెంట్‌ ప్రోగ్రామ్‌ ఆఫీసర్లు డాక్టర్‌ కౌశిక్‌, మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ విజయనిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాంతాచారి ఆశయ సాధనకు కృషి



శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

బోడుప్పల్‌: తెలంగాణ తొలి ఉద్యమ అమరుడు శ్రీకాంతాచారి ఆశయాలను కొనసాగిద్దామని శ్రీ గాయత్రి విశ్వకర్మ సంక్షేమ సంఘం బోడుప్పల్‌ అధ్యక్షులు భజ్జోజు శ్రీనివాస్‌చారి, ప్రధాన కార్యదర్శి అలుగోజు నర్సింహాచారి అన్నారు. బోడుప్పల్‌ అంబేడ్కర్‌ విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించిన శ్రీకాంతాచారి 15 వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి ఉప్పల్‌ శ్రీహరిచారి, కృష్ణబ్రహ్మాచారి, సోమయ్య, రాములుచారి, తిప్పారం విష్ణు పాల్గొన్నారు.

ఉప్పల్‌: తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారి అని బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నేతలు బన్నాల ప్రవీణ్‌ అన్నారు. మంగళవారం చిలుకానగర్‌ చౌరస్తాలో శ్రీకాంతచారి వర్ధంతి సందర్భంగా అశోక్‌చారి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. బన్నాల ప్రవీణ్‌ మాట్లాడుతూ.. రాష్ట్ర సాధనకు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా తృణప్రాయంగా అర్పించిన మహానేత అని కొనియాడారు. అంబటి జగదీష్‌, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, మాస శేఖర్‌, ఉపేందర్‌, సుందర్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన



పరిశీలిస్తున్న అడిషనల్‌ కలెక్టర్‌ రాధికగుప్తా

అల్వాల్‌: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని త్వరలో ప్రారంభభించనున్నట్లు జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ రాధికగుప్తా అన్నారు. అల్వాల్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాన్ని ఇంజినీరింగ్‌శాఖ, వైద్యాధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఆసుపత్రి భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలంగాణ డయాగ్నస్టిక్స్‌ మినీహబ్‌ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయన్నారు. త్వరితగతిన పనులు పూర్తైతే త్వరలో ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. వైద్యారోగ్య అధికారి డాక్టర్‌ రఘునాథస్వామి, ఇంజినీరింగ్‌ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మూసీని ప్రక్షాళన చేయాల్సిందే !



మూసీనదిలో దీపారాధన చేస్తున్న దృశ్యం

రామంతాపూర్‌: జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొట్టం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో మూసీ నదిని రక్షించాలని కోరుతూ రామంతాపూర్‌ ప్రతిభ విద్యానికేతన్‌ విద్యార్థులు మంగళవారం నాగోల్‌ రామంతాపూర్‌ మూసీనదిని సందర్శించి దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌ మధ్యలో నుంచి ప్రవహిస్తూ కోట్లాది మంది ప్రజలతో పాటు జంతు జీవ జాలానికి ప్రాణ సంకటగా మారిన మూసీని ప్రక్షాళన చేయాల్సిందేనని ఆయన అన్నారు. మూసీనది వలన జరుగుతున్న భూమి, గాలి, నీరు, ఆహార కాలుష్యాలతో ప్రజలు పడుతున్న బాధలు తీవ్ర అనారోగ్య సమస్యలు ప్రభుత్వాలు, పార్టీలకు తెలియజేయడానికి దీపోత్సవం నిర్వహించామన్నారు. స్కూల్‌ కరస్పాండెంట్‌ గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్‌ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, శాలిని, స్వప్న, ప్రియాంక పాల్గొన్నారు.